## క్లుప్తంగా

### యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హనుమంతు రెడ్డి

కోసిగి: మండలంలోని చిర్తనకల్లు గ్రామానికి చెందిన హనుమంతు రెడ్డి గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ కలహాల కారణంగా రెండు రోజుల క్రితం భార్య గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన హనుమంతు రెడ్డి మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి మనోజ్‌కుమార్ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఆదోనికి రెఫర్ చేశారు. ప్రస్తుతం హనుమంతు రెడ్డి కోలుకుంటున్నట్లు తెలిసింది.

### రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం భక్తులు విరాళం అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అయిజ పట్టణ వాస్తవ్యులైన విజయ్ కుమార్, శిరీష దంపతులు రూ.46,600లను ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

### దర్గాకు పోటెత్తిన భక్తులు



ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

### ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



షేక్షావలి దర్గాలో స్వామివారి సమాధి

హొళగుంద: ఎల్లార్తిలో వెలసిన షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శనం చేసుకుని ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో, షిర్డీ సాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాద, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

### పది సప్లిమెంటరీ హాల్ టికెట్ల విడుదల

తుగ్గలి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో విడుదల చేసిందని ఎంఈఓ–2 రామ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా bse.ap.gov.in నుంచి హాల్ టికెట్లు పొందవచ్చన్నారు. ఇదే వెబ్‌సైట్ ద్వారా స్ట్రీమ్, జిల్లా, పాఠశాల, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని నమోదు చేసి నేరుగా హాల్ టికెట్లు పొందవచ్చని చెప్పారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

# పుస్తకాల పంపిణీకి పక్కా ప్రణాళికలు

- తరగతుల వారీగా ప్రణాళిక సిద్ధం
- విద్యాశాఖకు నివేదిక పంపిన అధికారులు
- పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అందించే విధంగా చర్యలు



ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు (ఫైల్)

ఆదోని సెంట్రల్: విద్యా సంవత్సరం పునఃప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం విద్యాశాఖ స్థానిక అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలను అందించే విధంగా చర్యలు చేపట్టింది. పాఠ్యపుస్తకాల పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు పంపిణీ చేసేలా అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

ఆదోని నియోజకవర్గంలో 132 పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు – 87, ప్రాథమికోన్నత పాఠశాలలు – 20, ఉన్నత పాఠశాలలు – 23 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 30,900 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఏటా ఉచితంగా పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సెమిస్టర్–1, సెమిస్టర్–2గా విభజించి పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తారు. నియోజకవర్గంలో తరగతుల వారీగా విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్‌పుస్తకాలను వేసవి సెలవులు ముగిసేలోపు స్టాక్ పాయింట్లకు చేరవేసి, పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు అందజేయాలనే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**ఆకర్షణీయంగా పుస్తకాలు**

పాఠ్య పుస్తకాలు విదార్థులను ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. పుస్తకంలో ముద్రించిన క్యూఆర్ కోడ్ సాయంతో ఆన్‌లైన్‌లో పాఠ్యాంశానికి సంబంధించిన అదనపు సమాచారం పొందవచ్చు. పుస్తకాల భారం విద్యార్థులపై పడరాదని ప్రభుత్వం సెమిస్టర్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. గత విద్యా సంవత్సరం కూడా రెండు సెమిస్టర్లుగా పాఠ్య పుస్తకాలను ముద్రించారు. గతేడాది 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు సెమిస్టర్ విధానం అమలు చేయగా ఈ ఏడాది 10వ తరగతికి కూడా సెమిస్టర్ విధానం అమలు చేయనున్నారు. పాఠ్య పుస్తకాలను బైలింగ్వుల్ (రెండు భాషల్లో) విధానంలో ముద్రిస్తున్నారు. పుస్తకంలో పేజీకి ఒక వైపు ఇంగ్లిష్, మరోవైపు తెలుగులో పాఠ్య పుస్తకాలను ముద్రించారు. విద్యార్థులకు తెలుగుతో పాటు ఇంగ్లిష్ కూడా సులువుగా అర్థమయ్యే విధంగా చర్యలు చేపట్టారు.

**బడుల ప్రారంభం రోజే పంపిణీ**



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశాం. ఆయా పాఠశాలల నుంచి తరగతుల వారీగా ఎంతవరకు పాఠ్య పుస్తకాలు అవసరమో వాటికి సంబంధించిన ఇండెంట్లను సేకరించి ఉన్నతాధికారులకు పంపించాం. పాఠశాలలు పునఃప్రారంభించే రోజే విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మండలానికి పాఠ్య పుస్తకాలు చేరగానే వాటిని భద్రపరిచి బడులు తెరచిన మొదటిరోజు విద్యార్థులకు అందించేలా చర్యలు చేపడుతాం.

– శ్రీనివాసులు, మండల విద్యాధికారి–2

### ఆలయ భూముల కౌలుకు వేలం

ఆలూరు: పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆలయాల మాన్యం భూములను అక్రమంగా సాగుచేసినా, ఆక్రమించుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని డివిజన్ దేవాలయాల ఎగ్జిక్యూటివ్ అధికారి పీఎస్.రాధాకృష్ణ హెచ్చరించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామంలోని శ్రీ చెన్నకేశవ, భోగేశ్వర, నాగలింగేశ్వర, చౌడేశ్వర, గణేష్, తదితర ఆలయాలకు చెందిన భూమలను ఏడాది పాటు సాగు చేసుకునేందుకు గ్రామస్తులు, పెద్దలు, అర్చకులు సమక్షంలో వేలంపాట నిర్వహించామన్నారు. మొలగవెల్లి గ్రామంలో సర్వే నంబర్ 742 లోని 11.83 ఎకరాల మెట్టభూమిని రూ.80 వేలకు దాసరి రంగముని, సర్వే నంబర్ 7లోని 23.47 ఎకరాలను రూ.1,05,000లకు ఓంకార, 1150 సర్వే నంబర్‌లోని 47.67 ఎకరాలను రూ.1,80,000లకు గోపాల్, 640 సర్వే నంబర్‌లోని 7 ఎకరాల భూమిని దాసరి రంగమ్మ రూ.68 వేలకు, అలాగే 927 సర్వే నంబర్‌లోని 14.37 ఎకరాలను రూ.68 వేలకు, 899 సర్వే నంబర్‌లోని 15.08 ఎకరాల భూమిని సి.మానిక్ రూ.80 వేలకు దక్కించుకున్నట్లు వివరించారు. వేలం పాటలో పాడిన మొత్తం రూ.5,81,000 నిర్దేశిత గడువులోగా ప్రభుత్వ ఖజానాకు చెల్లించేలా అగ్రిమెంట్ కుదుర్చుకోవడం జరిగిందని ఈఓ వెల్లడించారు.

# నేత్రపర్వంగా ఆరాధనోత్సవాలు



ముద్దురంగా గురుస్వాముల వారికి పూజలు చేస్తున్న పీఠాధిపతి మఠం రంగప్పస్వామి



మూల విరాట్‌ను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం



నందికోలు సేవ నిర్వహిస్తున్న భక్తులు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో వెలసిన ఘన గురు దత్తాత్రేయ సాంప్రదాయ వంశపరంపర గంజెళ్ల వెంకటాగురు శిష్యుడైన శ్రీముద్దురంగా గురువుల 139వ ఆరాధన మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. గంజెళ్ల వెంకటాగురువుల వంశస్తులైన శ్రీ కృష్ణమూర్తి స్వామివారి ఆశీస్సులతో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పుణ్యగణారాధన కార్యక్రమంలో భాగంగా ముద్దురంగా గురువుల మూలవిరాట్‌ను పల్లకీలో ఉంచి పురవీధులగుండా వైభవంగా ఊరేగించారు. పల్లకీ ముందు నందికోలసేవ చేపట్టారు. మహిళలు సాంప్రదాయ దుస్తులతో కలశాలను చేతబట్టి ఊరేగింపులో పాల్గొన్నారు. నందికోలు సేవలో పీఠాధిపతులు, భక్తులు చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి. రాత్రి గురువుల విచరణ ప్రవచనం, ప్రసాద, భోజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అఖండ భజన కార్యక్రమాలతో మేలుకొలుపు చేపట్టారు. కార్యక్రమంలో మఠం రంగప్పస్వామి, మఠం శాంతమూర్తిస్వామి, బ్రహ్మేంద్రస్వామి, ఆనందమూర్తిస్వామి, శ్రీనివాసులు స్వామి, గురుమూర్తిస్వామి మహిళలు, చిన్నారులు మరియు భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



అమకతాడులో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలను వేదపండితులు ప్రారంభించారు. స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు చేపట్టారు. రాత్రి 8 గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పెళ్లి పీటలపై ఆశీనులుగావించారు. భక్తుల సమక్షంలో గ్రామానికి చెందిన కోయిలకొండ వీరభద్రుడు, సుజాతమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి కల్యాణం జరిపించారు. రాత్రి 9 గంటలకు బండిఆత్మకూరు మండలం, ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన గౌతమి బృందం బ్రహ్మంగారి నాటకాన్ని ప్రదర్శించారు.

## నేడు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు అందజేస్తామని చెప్పారు. పాల్గొనే వారు ఉదయం 9 గంటలలోపు ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9398141138, 8978509384, 9703516043 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు గర్భస్రావం

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన రాంపురం లక్ష్మీ అనే నిండు చూలాలికి బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో గర్భస్రావమైంది. కోసిగి వైద్యాధికారులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మి 9 నెలల నిండు గర్భిణి. ఆమె ప్రతి నెలా కోసిగి హాస్పిటల్‌లో పరీక్షలు చేయించుకునేదన్నారు. ప్రసవం నిమిత్తం పుట్టినిల్లు భూంపల్లి గ్రామానికి వెళ్లింది. ఆమెకు స్కానింగ్ పరీక్షలు చేయించేందుకు భర్త నాగరాజుతో కలిసి బైక్‌పై కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు వెళ్లారు. స్కానింగ్ పరీక్షలు చేసిన వైద్యులు తల్లీ, కడుపులో బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. అనంతరం తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో బైక్ అదుపుతప్పి కిందకు పడిపోయారు. లక్ష్మి తలకు గాయమై అపస్మారక స్థితిలో పడిపోయింది. వెంటనే ఆమెను రాయచూరు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు పురిటిలోనే బిడ్డ మృతి చెందినట్లు గుర్తించారు. సిజేరియన్ చేసి మృతి చెందిన బిడ్డను బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మి కాసేపటికి తేరుకోవడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తల్లి గర్భంలోనే శిశువు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

### ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం సురక్షితం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మద్దికెర: ప్రభుత్వ వైద్యశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఇక్కడే ప్రసవాలు సురక్షితమని వైద్యాధికారి రాగిణి తెలిపారు. గురువారం స్థానిక వైద్యశాలలో గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యశాలలో కాన్పులకు, గర్భిణులకు అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. జరుగుతుందన్నారు. మహిళలు ప్రతినెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యులు సూచనల మేరకు జాగ్రత్తలు పాటిస్తే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ల్యాబ్ అసిస్టెంట్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

### అందరికీ పనులు కల్పిస్తాం

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. గురువారం కల్లూరు మండలంలోని పెద్దటేకూరు తడకనపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం వస్తుందన్నారు. గ్రామాల్లోని ఉపాధి హామీ పథకం వేతనదారులు పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఈసీ మధుసూదన్‌రావు, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



పెద్దతుంబళంలో పొలాన్ని దుక్కిదున్నుతున్న రైతన్న

- వర్షం రాకతో హర్షం
- పొలాలను దుక్కి దున్నుతున్న రైతన్నలు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు

ఆదోని రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలు బాగా తడిశాయి. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తూ దుక్కులు దున్నుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జూన్ నెలలో ప్రారంభం కానుంది. దీంతో పొలాలను చదును చేసుకుని సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. గత సీజన్‌కు సంబంధించి పొలాల్లో మిగిలిపోయిన పంట వ్యర్థాలను మార్చి, ఏప్రిల్ నెలల్లో తొలగించారు. నేల బాగా తడవడంతో దుక్కి దున్నడానికి అనువుగా మారిందని రైతులు పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే పంటల సాగుకు అనువుగా ఉంటుందని, పంటలు బాగా పండితే తమ అప్పులు తీరుతాయని పలువురు రైతులు పేర్కొన్నారు. మరో వర్షం వస్తే విత్తనం వేసేందుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటామని రైతులు చెబుతున్నారు.

**గ్రామాల్లో విత్తుకు పొలాలు సిద్ధం...**

ఆదోని మండలంలోని పెద్దతుంబళం, కుప్పగల్, పాండవగల్, బల్లేకల్, దొడ్డనగేరి, పెసలబండ, కపటి, ఆరేకల్, బైచిగేరి, సాంబగల్, నెట్టేకల్, చిన్నపెండేకల్, దిబ్బనకల్, బసరకోడు, సలకలకొండ, విరుపాపురం తదితర గ్రామాల్లో అనువైన వర్షం కురవడంతో వ్యవసాయ పనులకు సేద్యం చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. గత నాలుగు రోజులుగా గ్రామాల్లో రైతులు పొలాలను దుక్కిదున్నుకొని విత్తన సాగుకు చదును చేసుకున్నారు. ఆదోని మండలంలో రైతులు ఏటా పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఈ మేరకు విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

**గోనెగండ్ల మండలంలో..**

గోనెగండ్ల: మండలంలో రెండు రోజుల క్రితం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు భూముల్లో దుక్కులు చేపట్టారు. తొలి వర్షానికి దుక్కులు చేసుకున్న రైతులు విత్తనాలు విత్తడం మొదలెట్టారు. బోర్లు, బావులు ఉన్న రైతులు ముందస్తు పొలం పనులు పూర్తి చేసుకున్న రైతులు తమ పంట పొలాల్లో వేరుశనగ, పత్తి, ఉల్లి, కంది తదితర పంటలు సాగుచేశారు. ఈ ఏడాది వర్షాలు ముందస్తుగా కురుస్తుండడంతో మరింత మంది రైతులు పంటలను సాగు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ సారి సాధారణం కంటే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగవచ్చునని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

# మేమంతా ఓటు వేయం!

- ఆదోని నియోజకవర్గంలో ఓటుహక్కు వినియోగించుకోని 88 వేల మంది ప్రజలు
- మొత్తం 2,63058 మంది ఓటర్లు
- ఓటు వేసిన వారు 1,75,064 మంది

ఆదోనిటౌన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఆదోని నియోజకవర్గంలో వేలాది మంది ఓటుకు దూరమయ్యారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం లేక, ఇతరత్రా కారణాలు ఏవైనా ఉన్నాయో లేదో తెలియదుగానీ ఇక్కడ పోలింగ్ శాతం తగ్గినట్లు తెలుస్తోంది. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో 87,990 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోలేకపోయారు. నియోజకవర్గంలో మొత్తం 2,63,058 మంది ఓటర్లు ఉన్నారు. 44 గ్రామాలు, 42 వార్డులు ఉన్నారు. దాదాపు 3 లక్షల జనాభా ఉంది. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ కోసం 256 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 1,75,064 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 87,990 మంది ఓటుకు దూరంగా ఉండిపోయారు. దీంతో ఓటింగ్ శాతం తగ్గినట్లు తెలుస్తోంది. ఆదోనిలో ఉన్నత వర్గాలు నివాసముంటున్న ప్రాంతాల్లోనే ఓటు హక్కును వినియోగించుకోలేదని ఆయా కేంద్రాల్లో పోలైన ఓట్ల శాతాన్ని బట్టి తెలుస్తోంది. దీంతో ఉన్నత వర్గాలు ఓటు వేయడంతో నిరాసక్తత చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో 87,949 పురుషులు, 87,096 మంది మహిళా ఓటర్లు, ట్రాన్స్‌జెండర్స్ 19 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

# పీడిస్తున్న నకిలీ భూతం

- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్త
- మార్కెట్‌లో విచ్చలవిడిగా నకిలీలు

గోనెగండ్ల: ఖరీఫ్‌లో వివిధ పంటలను సాగు చేసేందుకు రైతన్నలు ముందస్తుగా ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేస్తుంటారు. ఇలాంటి సమయంలోనే అనుమతులు లేని కంపెనీ విత్తనాలు, ఎరువులు మార్కెట్లోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి అన్ని వివరాలను పరిశీలించిన తరువాతే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలుచేయాలి. లైసెన్సు లేని వ్యక్తులు, దుకాణాలు, దళారులు ఇతరత్రా ఎక్కడబడితే అక్కడ కొనుగోలు చేయకూడదు. సరుకు లాట్ నంబరు, తయారీ తేదీ, రకం, ఇలా అన్ని వివరాలు కలిగి ఉండి సంతకం చేసిన బిల్లును విక్రయదారుల నుంచి తప్పనిసరిగా పొందాలి. సంచులపై సీలు విప్పినట్లు లేదా, విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే అలాంటి వాటిని తీసుకోకూడదు. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తన బస్తాతో లభించే చీటీ (ట్యాగ్) ఉందో లేదో గమనించి, ఉన్నది మాత్రమే తీసుకోవాలి. ఆ చీటిని ఏడాది పాటు భద్రంగా ఉంచుకోవాలి. క్రిమిసంహారక మందుల డబ్బాపై కంపెనీ పేరు తయారీ తేదీ కాల పరిమితి గమనించి అందుకు అనుగుణంగా బిల్లులు తీసుకోవాలి. ఏది ఎంత ధరకు కొన్న డీలర్ లేదా దుకాణదారుడి సంతకంతో బిల్లు పొందాలి. నకిలీవి అని అనుమానం వస్తే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. అగ్రిల్యాబ్‌లలో ఉచితంగా నకిలీ నిర్ధారణ పరీక్షలు చేయించవచ్చు. లైసెన్సు లేకుండా విత్తనాలు ఎరువులు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. నకిలీవి అని తేలితే విత్తనం ఎరువులు క్రిమి సంహారక చట్టాల ప్రకారం సంబంధిత డీలరు, కంపెనీ, దుకాణదారునిపై కేసు నమోదు చేస్తారు.

**అనుమతులు లేని మందులను విక్రయిస్తే చర్యలు**



విత్తనాలు, ఎరువుల దుకాణదారులు అనుమతులు లేని మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోరాదు. బ్యాచ్ నెంబర్ లేని పురుగు మందులు కొనుగోలు చేయరాదు. విత్తనాలు, ఎరువులు కొనుగోలులో ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా దుకాణదారుడి నుంచి బిల్లు తీసుకోవాలి.

– హేమలత, వ్యవసాయ అధికారిణి, గోనెగండ్ల

### చర్చిలో చోరీ

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఉన్న ఇంటింటి సువార్త ప్రార్థనా మందిరంలో చోరీ జరిగినట్లు సంఘపెద్దలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ చర్చిలో ఉన్న సుమారు 11 వేల విలువ గల సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని తెలిపారు.